క్లుప్తంగా

అనారోగ్యంతో హోంగార్డు మృతి


మందా రాజశ్రీ

దాచేపల్లి : అనారోగ్యంతో మహిళ హోంగార్డు మంగళవారం మృతిచెందింది. దాచేపల్లి పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న మందా రాజశ్రీ(42)గత కొంత కాలంగా కిడ్నీ సంబంధిత సమస్యతో బాధపడుతున్నారు. ఈమె భర్త గతంలో చనిపోగా కుమార్తె ఉంది. సొంత నివాసం కూడా లేకపోవటంతో నారాయణపురంలో ఉంటున్న తమ్ముడు కొమెరబత్తిన విజయ్‌కుమార్ వద్ద ఉంటుంది. గత నెల రోజుల నుంచి కిడ్నీ సమస్యకు చికిత్స పొందుతున్న క్రమంలో సమస్య తీవ్రమవటంతో హాస్పిటల్‌కి తరలిస్తుండగా ఆమె మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి హోంగార్డు రాజశ్రీ మృతదేహానికి నివాళులర్పించారు.

నేడు మినీ జాబ్ మేళా

పిడుగురాళ్ల: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డిపార్టుమెంట్ ఆఫ్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ వారి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ మినీ జాబ్ మేళాను బుధవారం నిర్వహించనున్నట్లు పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సంజీవరావు తెలిపారు. జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశాల మేరకు పిడుగురాళ్ల పట్టణంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరిసర ప్రాంత యువతీ యువకులు ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా సూచించారు. హెటిరో డ్రగ్స్, పేటీఎం, ఇన్నోవా సోర్స్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ జాబ్ మేళాకు 10వ తరగతి నుంచి పీజీ వరకు చదువుకున్న 18 నుంచి 30 సంవత్సరాల లోపు వారు బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ నకలు, పాస్‌పోర్టుసైజు ఫొటోతో నేరుగా హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9492158193,7842747682 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

జిల్లా స్థాయిలో జూలకల్లు విద్యార్థుల ప్రతిభ



పిడుగురాళ్లరూరల్: నేషనల్ గర్ల్స్ చైల్డ్ డే సందర్భంగా సేవ్ ది గర్ల్ చైల్డ్ కార్యక్రమంలో భాగంగా నరసరావుపేటలో జిల్లా స్థాయిలో నిర్వహించిన ఎస్సే రైటింగ్, డిబేట్, పెయింటింగ్ పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ చూపినట్లు జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సుబ్బరామయ్య తెలిపారు. ఎస్సే రైటింగ్‌లో 10వ తరగతి విద్యార్థిని టి.మహిమ, డిబేట్‌లో 10వ తరగతి విద్యార్థిని జి.లక్ష్మీచరణ్య, పెయింటింగ్‌లో 9వ తరగతి విద్యార్థి ఎస్‌కే సుభానిలు ప్రథమ బహుమతి సాధించినట్లు తెలిపారు. గెలుపొందిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.


9,450 మందికి రూ.27.76 కోట్ల లబ్ధి

ఎంపీపీ మేకల శారదాశ్రీనివాసరెడ్డి

కారెంపూడి: మహిళలు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు అన్ని విధాలా చేయూతనిస్తున్నారని కారెంపూడి ఎంపీపీ మేకల శారదాశ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. నాలుగవ విడత వైఎస్సార్ ఆసరా విడుదల సందర్భంగా మంగళవారం ఎంపీపీ మాట్లాడారు. మండలంలో వైఎస్సార్ ఆసరా 945 డ్వాక్రా గ్రూపులకు చెందిన 9,450 మందికి రూ.6.94 కోట్లు విడుదలయ్యాయని పేర్కొన్నారు. జగనన్న ఇచ్చిన హామీ మేరకు డ్వాక్రా మహిళలకు రుణమాఫీ కింద టైం ప్రకారం నాలుగవ విడత కూడా నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. గడచిన నాలుగేళ్లలో ఇప్పటి వరకు కారెంపూడి మండలంలో 9,450 మంది డ్వాక్రా మహిళలకు మొత్తం రూ.27.76 కోట్లు మంజూరు కావడం జరిగిందన్నారు. వాస్తవంగా మండలంలో పదివేల కుటుంబాలకు ఆర్థిక చేయూత అందినట్లయిందన్నారు. జగనన్న ప్రభుత్వం మహిళల అభ్యున్నతి కోరుకునే ప్రభుత్వమని ఎంపీపీ వివరించారు.

నేతాజీ జీవితం యువతకు ఆదర్శం

డాక్టర్ ఎంబీ చిన్నమ్మ



రెంటచింతల: దేశ స్వాతంత్య్ర పోరాటంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ పాత్ర ఎంతో కీలకమైందని ఆయన జీవితం యువతకు ఆదర్శమని డాక్టర్ ఎంబీ చిన్నమ్మ అన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం స్థానిక సుబ్బన్నతోట కాలనీలోని మండల పరిషత్ పాఠశాలలో ఆమె హెచ్‌ఎం ప్రతాప్, అర్చకులు మారుతీ శర్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. స్వాతంత్య్ర సమరయోధుల జీవిత చరిత్రలను విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. దేశానికి స్వాతంత్య్రం తీసుకురావడానికి ఎందరో మహానుభావులు తమ ప్రాణాలను, జీవితాలను త్యాగం చేశారని వారిని స్మరించుకోవడం మనం ఎప్పటికీ మరవకూడదన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సుందరం.. నగర వనం

పక్షుల కిలకిల రావాలు.. ఎటు చూసినా పచ్చదనంతో కనువిందు చేసే దృశ్యాలు. ఆహ్లాదకరమైన వాతావరణంలో సేదతీరడం ఒక చక్కటి అనుభూతి. మానసిక ప్రశాంతత ను ఇస్తుంది. ప్రస్తుత ఉరుకుల, పరుగుల జీవితంలో ప్రపంచంతో పోటీ పడి పరిగెత్తే రోజులు ఇవి. నిత్యం మానసిక ఒత్తిడితో బాధపడే వారు ప్రకృతి ఒడిలో సేదతీరడం ద్వారా ఉపశమనం కలుగుతుంది.


చెరువు చుట్టు పెంచుతున్న మొక్కలు ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్

- రూపురేఖలు మారిన దూబచెరువు
- వాకింగ్ ట్రాక్‌తో పాటు జిమ్ సౌకర్యం, పిల్లల పార్కు ఏర్పాటు
- రూ.2.10 కోట్లతో ఆధునీకరణ

గురజాల : నగర పంచాయతీ ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు దూబచెరువును సుందరవనంగా తీర్చిదిద్దారు. మరికొద్ది రోజుల్లో పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు నగర పంచాయతీ చైర్‌పర్సన్ పోలు పవన్‌మైవీరారెడ్డి కృషి చేస్తున్నారు. గతంలో గురజాల ఒక మేజర్ గ్రామ పంచాయతీ. నేడు గురజాల–జంగమహేశ్వరపురం విలీనం చేసి నగర పంచాయతీగా ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మార్చారు. గత ప్రభుత్వ హయాంలో దూబచెరువులోని నీటిలో పశువులు తిరుగుతుండేవి. చుట్టూ చిట్టడవిని తలపించేలా ఉండేది. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి నిధులు సమకూర్చి చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్‌తో పాటు ఫెన్సింగ్ ఏర్పాటు, మొక్కలు నాటి వాటి సంరక్షణ చేయిస్తున్నారు. నిత్యం అక్కడ ఎంతో మంది వాకింగ్ చేస్తున్నారు.


ఏర్పాటుచేసిన జిమ్ పరికరాలు, పార్కులో పిల్లల పరికరాలు

సుమారు రూ.2.10 కోట్లతో ఆధునీకరణ

గురజాల నగర పంచాయతీలోని దూబచెరువును సుమారు రూ.2.10 కోట్లతో ఆధునీకరణ చేయడంతో పాటు వాకింగ్ ట్రాక్ ఏర్పాటు, చిన్నారులకు పార్కు, జిమ్ వంటివి అందుబాటులోకి తీసుకువచ్చారు. 400 ఏళ్ల నాటి చరిత్ర కలిగిన దూబచెరువును ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చొరవతో సుందరవనంగా తీర్చిదిద్దారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

ప్రజలు రోజంతా ప్రకృతి ఒడిలో పచ్చదనం తోడుగా ఉల్లాసంగా...ఉత్సాహంగా గడిపే విధంగా దూబచెరువును తీర్చిదిద్దారు. పిల్లలు ఆడుకునేందుకు గాను పార్కు ఏర్పాటు చేసి అందులో ఊయలలు, జారుడు బల్లలు తదితర వాటిని ఏర్పాటు చేశారు. అదే విధంగా పెద్దలు జిమ్ చేసుకునేందుకు ఏర్పాట్లు చేశారు. గతంతో పోల్చితే దూబచెరువు రూపురేఖలు పూర్తిగా మారిపోయాయనే చెప్పవచ్చు.

సుందర వనంగా దూబచెరువు..



గురజాలలోని దూబచెరువుకు 400 ఏళ్ల నాటి చరిత్ర కలదు. ఈ దూబచెరువు గతంలో అధ్వానంగా ఉండేది. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చొరవతో ఇచ్చిన హామీ ప్రకారం నిధులు కేటాయించి సుందరవనంగా తీర్చిదిద్దారు. మొదటి కౌన్సిల్ సభ్యుల పేర్లు చిరస్థాయిగా నిలిచిపోయే విధంగా అభివృద్ధి చేయడం జరిగింది. కొంత మేర పనులు ఉన్నాయి. అవి కూడా త్వరలో పూర్తి చేసి అన్ని విధాలా ప్రజలకు దూబచెరువును అందుబాటులోకి తీసుకువస్తాం.

– నగర పంచాయతీ చైర్ పర్సన్, పోలు పవన్‌మై వీరారెడ్డి

త్వరలో ప్రారంభం...



దూబచెరువు వాకింగ్ ట్రాక్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చాం. త్వరలో పిల్లల పార్కుతో పాటు జిమ్ చేసుకునే విధంగా అన్నీ అందుబాటులోకి తీసుకువస్తాం. జిమ్‌కు సంబంధించిన పరికరాలు, పిల్లలకు సంబంధించిన పార్కు పరికరాలు సిద్ధం చేయడం జరిగింది. త్వరలో ప్రారంభించి ప్రజలకు, చిన్నారులకు అందుబాటులోకి తీసుకువస్తాం.

– అన్నదాత మోహన్ శ్రీనివాస్, కమిషనర్, గురజాల

బ్రహ్మనాయుడు కాలనీలో డోర్ టు డోర్ సర్వే

కారెంపూడి: అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న మండలంలోని పెదకొదమగుండ్ల శివారు బ్రహ్మనాయుడు కాలనీలో మంగళవారం గాదెవారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది పర్యటించి ప్రజల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. అనారోగ్య సమస్యలున్న వారికి డాక్టర్ ఎం.విజయానాయక్ వైద్య సేవలందించారు. ఒకరికి డెంగ్యూ జ్వరం ఉందని అతను కూడా కోలుకున్నాడని వైద్య సిబ్బంది తెలిపారు. మంగళవారం కూడా డోర్ టు డోర్ సర్వే నిర్వహించామన్నారు. ఇదిలా ఉంటే ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి ఆదేశాలతో డ్రైనేజీల్లో ఉన్న వాటర్ పైపులను మార్చడం జరిగిందని, బ్లీచింగ్ చల్లడంతో పాటు ఫాగింగ్ కూడా చేయించామని, బోరు నీటిని క్లోరినేషన్ చేయించామని ఈఓపీఆర్డీ సత్యప్రసాద్ తెలిపారు. నీటి శాంపిల్స్‌ను పరీక్షలకు గుంటూరు పంపామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేష్ తెలిపారు. ప్రస్తుతం 8 మంది వైద్య సేవలు పొందుతున్నారని వారి ఆరోగ్యం నిలకడగానే ఉందని అధికారులు చెప్పారు.


వైద్య సేవలందిస్తున్న డాక్టర్ విజయానాయక్

నేడు ఆసరా చెక్కుల పంపిణీ

పిడుగురాళ్ల: పట్టణంలో వివిధ సచివాలయాల పరిధిలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చేతుల మీదుగా వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ చింతా వెంకట రామారావు తెలిపారు. ఉదయం 10 గంటలకు లెనిన్ నగర్‌లోని యూపీహెచ్‌సీలో, 11 గంటలకు నాగుల గుడి దేవస్థానం, 12 గంటలకు పంపు హౌస్ వద్ద, 4 గంటలకు గాంధీనగర్ సచివాలయం, 5 గంటలకు రైల్వే స్టేషన్ రోడ్డులో నిర్వహించటం జరుగుతుందని ఆయన తెలియజేశారు.

నాణ్యమైన వైద్య సేవలే లక్ష్యం

- ఆరోగ్య సురక్ష.. పేదలకు రక్ష: వైస్ ఎంపీపీ
- చింతపల్లిలో విజయవంతంగా జగనన్న సురక్ష వైద్య శిబిరం


ఆరోగ్య సురక్ష కిట్లను పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

గురజాల : జగనన్న ఆరోగ్య సురక్ష.. నిరుపేదలకు రక్ష అని వైస్ ఎంపీపీ వేముల శేషమ్మ చలమయ్య అన్నారు. మండలంలోని చర్లగుడిపాడు గ్రామంలో మంగళవారం సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రతి పేదవాడికి కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో పాలన అందించడం జరుగుతుందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఎంతో మంది వృద్ధులు వైద్య సేవలు పొందుతున్నారు. ప్రతి ఒక్కరికి నాణ్యమైన వైద్య సేవలు అందించడమే సీఎం వైఎస్ జగన్ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బత్తుల ప్రసాద్, సీనియర్ నాయకుడు కావూరి అంజిబాబు, మాజీ సర్పంచ్ పోట్ల నారాయణ, ముక్కటం, పోటు సాంబయ్య, బండ్ల సాంబశివరావు, తండా మస్తాన్, డి.మణిదీప్, ఎంపీడీవో ఆర్ ఫణికుమార్‌నాయక్, సెక్రటరీ శివ కోటేశ్వరరావు, తదితరులున్నారు.

వైద్య సేవలతో ఉపశమనం

కారెంపూడి: మండలంలోని చింతపల్లి గ్రామంలో మంగళవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి అనారోగ్య సమస్యలున్న ప్రజలు భారీగా తరలివచ్చారు. గాదెవారిపల్లె పీహెచ్‌సీ వైద్యులు, వైద్య సిబ్బంది, చింతపల్లి గ్రామంలోని వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ వైద్య సిబ్బంది వైద్య సేవలందించి వైద్య శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. వైద్య శిబిరంలో తొలుత జగనన్న ఆరోగ్య సురక్ష కార్డులు రాయించుకుని తర్వాత బీపీ, షుగర్‌తో పాటు వివిధ రకాల పరీక్షలు చేయించుకున్నారు. సంబంధిత స్పెషలిస్ట్ డాక్టర్ల వద్ద చూపించుకుని తర్వాత మందులను కౌంటర్లో ఉచితంగా తీసుకుని ఉపశమనంతో ఇళ్లకు వెళ్లారు. శిబిరంలో 300 మంది వైద్య సేవలు పొందారు. కంటి సమస్యలున్న 120 మంది పరీక్షలు చేయించుకున్నారు. వారిలో 100 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించామని ఆప్తాలమిక్ ఆఫీసర్ ప్రసాద్ నాయక్ తెలిపారు. వైద్య శిబిరంలో డాక్టర్ ఎం.విజయానాయక్, స్త్రీల ప్రసూతి వైద్య నిపుణురాలు డాక్టర్ మాధవీలత, పిల్లల వైద్యులు డాక్టర్ అలైక్య, డాక్టర్ లక్ష్మారెడ్డి వైద్య సేవలందించారు. వైద్య సిబ్బంది రసూల్, విజయలక్ష్మి, సరళ, శ్రీనివాసరావు, సాగర్, రాణి, శాంతకుమారి, సునీత, షాహీనా, సుల్తాన్, రాము, రామ్మోహన్, రజని, ధనలక్ష్మి, 104 సిబ్బంది, ఆశా వర్కర్లు శిబిరంలో వైద్య సేవలందించారు.

మిరప పంట క్షేత్ర ప్రదర్శన

దాచేపల్లి : మండలంలోని ముత్యాలంపాడు గ్రామంలో మిరప పంటపై శిక్షణ, క్షేత్ర ప్రదర్శన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం, ఉద్యాన పరిశోధన సంస్థ, లాంఫామ్ శాస్త్రవేత్తలు తయారు చేసిన ఎల్‌సీఏ–643 అనే మిరప విత్తనం గ్రామానికి చెందిన కొమ్మిరెడ్డి వెంకటరెడ్డి 12 ఎకరాల్లో సాగు చేశాడు. ఈ రకం విత్తనం మొదటిసారిగా సాగు చేస్తుండటంతో డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ డాక్టర్ టి.జానకిరామ్‌తో పాటు పలువురు శాస్త్రవేత్తలు మిరప పంటను పరిశీలించారు. వైస్ చాన్స్‌లర్ డాక్టర్ జానకి రామ్ మాట్లాడుతూ ఈ విత్తనం చీడపీడలను తట్టుకుని అధిక దిగుబడులు ఇస్తుందని, పురుగు మందుల వాడకం తక్కువగా ఉంటుందన్నారు. వ్యవసాయశాఖ, ఉద్యానవన శాఖ అధికారుల సూచనల మేరకు మందులు పిచికారీ చేయాలని ఆయన అన్నారు. మిరప కాయలు నాణ్యతను తెలిపే ల్యాబ్‌ను ఏర్పాటు చేయాలని జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి కోరగా, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. తెగుళ్ల నివారణ యాజమాన్యంపై కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎల్.నారంనాయుడు, జోనల్ రీసెర్చ్ హెడ్ డాక్టర్ కె.ధనుంజయరావు, సర్పంచ్ వెంకటచారి, ఎంపీటీసీ పావవెంకటనాగయ్య, ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు, ఉద్యానవన అధికారి వై.మోహన్, ఏవో డి.పాపకుమారి, లాంఫామ్ శాస్త్రవేత్తలు గిరిధర్, వెంకటరమణ, విజయలక్ష్మి, నాగలక్ష్మి, రజని, ఫణికుమార్, రాధిక పాల్గొన్నారు.


మిరప పంటను పరిశీలిస్తున్న వైస్ చాన్స్‌లర్ జానకిరామ్, శాస్త్రవేత్తలు

పదో తరగతి విద్యార్థి అదృశ్యం

దుర్గి: మండల కేంద్రం దుర్గికి చెందిన తురక ఈశ్వర్(16) తప్పిపోయినట్లు తల్లిదండ్రులు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ ఎస్ కోటయ్య తెలిపిన వివరాల ప్రకారం ఈశ్వర్ స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో 10వ తరగతి చదువుతున్నాడని స్కూల్ అయిపోయినా ఇంటికి రాకపోవటంతో తల్లిదండ్రులు ఫిర్యాదు చేసారన్నారు. ఈశ్వర్ కొంచెం అమాయకంగా ఉంటాడని, కోల ముఖం, నలుపు రంగులో ఉంటాడన్నారు. ఇంటి నుంచి వెళ్లేటప్పుడు నీలం రంగు చొక్కా, ప్యాంటు ధరించి ఉన్నాడు. ఆచూకీ తెలిసిన వ్యక్తులు 8019120842 సెల్ నెంబర్‌కు ఫోన్ చేయాలని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి సమష్టిగా పనిచేయండి



మాచర్ల రూరల్: గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై అన్ని శాఖల అధికారులు పరిశీలన జరిపి తగు నివేదికను అందించాలని ఎంపీపీ బూడిద మంగమ్మ కోరారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉపాధి హామీ పథకం, గృహ నిర్మాణాలు జరుగుతున్న తీరుపై అధికారులను వివరాలడిగారు. అలాగే రానున్న వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తీసుకుంటున్న చర్యలపై, వైద్యం, ఆరోగ్య శిబిరాల తీరుపై అధికారులతో చర్చించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి మాట్లాడుతూ వ్యవసాయానికి జగనన్న ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యతనిస్తుందని, రైతు భరోసా కేంద్రాలు తీసుకొచ్చి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మండ్లి పెద మల్లుస్వామి, వైస్ ఎంపీపీ సుజాతకోటిరెడ్డి, ఎంపీడీఓ సరోజనీదేవి, ఈవోపీఆర్డీ కోటేశ్వరరావు, ఎంఈవో వేముల నాగయ్య, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.

నేడు కానుకమాత చర్చి జెండా ఆవిష్కరణ

రెంటచింతల: స్థానిక కానుకమాత చర్చి 174వ తిరునాళ్ల మహోత్సవ వేడుకలలో భాగంగా బుధవారం సాయంత్రం 4.30 గంటలకు కారెంపూడి విచారణ గురువులు రెవ.ఫాదర్ నరిశెట్టి అంథోనిబాల జెండాను ఆవిష్కరించనున్నట్లు కానుకమాత చర్చి విచారణ గురువులు ఏరువ లూర్దు మర్రెడ్డి అన్నారు. మంగళవారం విలేకర్ల సమావేశంలో ఫాదర్ మర్రెడ్డి మాట్లాడుతూ జెండా ఆవిష్కరణ అనంతరం అతిపురాతనమైన కానుకమాత దేవాలయ ప్రాంగణంలో రెవ.ఫాదర్ అంథోనిబాల నిర్వహించే దివ్యపూజాబలితో పండుగ మహోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ఫిబ్రవరి 1వ తేదీ వరకు ప్రతి రోజు గ్రామంలోని పలు ప్రాంతాలలో సాయంత్రం 4.30 గంటలకు నవదిన ప్రార్థనలు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. ఈ నవదిన ప్రార్థనలలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కోరిన వరాలు ఇచ్చే కానుకమాత దీవెనలు పొందాలని కోరారు.

రూ.21.96 కోట్ల ఆసరా

- మహిళా సాధికారతే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం
- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి


పిన్నెల్లిలో డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

మాచవరం: రాష్ట్రంలో మహిళా సాధికారతే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ ఆసరా నాలుగో విడత ఆర్థిక సాయం విడుదల సందర్భంగా మండలంలోని పిన్నెల్లి, గంగిరెడ్డిపాలెం, మాచవరం, కొత్తపాలెం, మోర్జంపాడు, మల్లవోలు, పిల్లుట్ల గ్రామాల్లో మంగళవారం గ్రామ సభలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రభుత్వం విడుదల చేసిన ఆసరా చెక్కులను డ్వాక్రా మహిళలకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల సమయంలో డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేస్తానని ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ నాలుగు విడతలుగా మండలంలోని 810 డ్వాక్రా గ్రూపులలోని 8,128 మంది అక్కచెల్లెమ్మల ఖాతాల్లో నేరుగా మొత్తం రూ.21,96,77,684 నగదును జమచేయడం జరిగిందని తెలిపారు. రుణమాఫీ చేస్తానని టీడీపీ అధినేత చంద్రబాబు డ్వాక్రా మహిళలను మోసం చేసారని విమర్శించారు. నేడు సీఎం జగన్ అక్కచెల్లెమ్మల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. ఆసరా పథకం పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలకు బాసటగా నిలుస్తుందన్నారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభోత్సవం ...

మాచవరం జెడ్పీ హైస్కూల్‌లో నాబార్డు, నాడు–నేడు ద్వారా రూ.2.25 కోట్లతో చేపట్టిన అదనపు గదులను, రూ.25 లక్షలతో నిర్మించిన శాలివాహన కల్యాణ మండపాన్ని, రూ.40 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. 8వ తరగతి విద్యార్థులకు ట్యాబులు అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారిని, ఇటీవల మృతి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుల కుటుంబాలను పరామర్శించారు. ఎంపీడీఓ వరప్రసాద్, మండల కన్వీనర్ చౌదరి సింగరయ్య, జెడ్పీటీసీ శివాయాదవ్, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లక్ష్మిరెడ్డి, వైస్ ఎంపీపీ నన్నే షైదా, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, సర్పంచుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అల్లాభక్షు, ఏపీఎం సురేష్, నాయకులు సైమన్, అనిల్‌కుమార్, సుబ్బారావు, జానీ, నరసింహారెడ్డి, గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.23.50 కోట్లతో పిల్లుట్ల గ్రామాభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

మాచవరం: ప్రజాపాలనే లక్ష్యంగా ప్రజా సంక్షేమంతో పాటు గ్రామాల సమగ్రాభివృద్ధికి సీఎం జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని పిల్లుట్ల సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. గ్రామంలో జగనన్న కాలనీ సమీపంలో రూ.2.53 కోట్ల నిధులతో పీహెచ్‌సీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నూతనంగా నిర్మించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పిల్లుట్ల గ్రామంలో సంక్షేమ పథకాలతో పాటు, అభివృద్ధికి రూ.23,50,18,383 ఖర్చు చేసినట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు జగనన్న కాలనీలో పట్టాలు మంజూరు చేసామన్నారు. నవ రత్నాల పథకాల ద్వారా ప్రతి ఇంటికీ సుమారు రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర వరకు మేలు జరిగిందన్నారు. ప్రజా సేవే లక్ష్యంగా ప్రభుత్వ సేవలు అందించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ఏర్పాటు చేసారన్నారు. మంచి చేసిన వారిని గుర్తించాలని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరలా ఆదరించాలని, మరొక్కసారి గురజాల నియోజకవర్గ ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించాలని కోరారు. మండల కన్వీనర్ చౌదరి సింగరయ్య, జెడ్పీటీసీ శివాయదవ్, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లక్ష్మిరెడ్డి, వైస్ ఎంపీపీ నన్నే షైదా, జిల్లా కార్యదర్శి జె.వి.నరసింహారెడ్డి, మాజీ సర్పంచులు నిర్మలాపుల్లారెడ్డి, షర్మిలానర్సిరెడ్డి, బీసీ విభాగం మండల కన్వీనర్ సురేష్, నాయకులు రామిరెడి, సైదులు, అంకమ్మ, టి.సాంబశివరావు, కోటేశ్వరావు, రమేష్, వీరయ్య, పామిరెడ్డి, నాగిరెడ్డి, రత్నం, నరసింహారావు, లింగారావు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా ఫణీంద్రకుమార్



దుర్గి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నూతనంగా ఐ.ఫణీంద్రకుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన మాచర్ల కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ పదోన్నతిపై దుర్గికి బదిలీ అయ్యారు. రెవెన్యూ విభాగానికి సంబంధించి ప్రజలు నేరుగా తమ కార్యాలయాన్ని సంప్రదించి పరిష్కరించుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. అందుబాటులో ఉండి తమ సిబ్బంది పౌర సేవలకు పూర్తిగా అందే విధంగా కృషి చేస్తామని తెలిపారు.